విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కార్మిక ఉద్యమాన్ని కొనసాగించాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఉద్యమాన్ని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియాకమిటీ ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న లేబర్ స్కూల్ లో 17 వ క్లాస్ ఏఐటీయూసీ సిపాయిపేటలోని భవననిర్మాణ కార్మికసంఘ కార్యాలయంలో జరిగింది. ఈవారం వక్తగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్, న్యాయవాది బండి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ చరిత్ర, సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలు, 1990 లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు మొదలయ్యాక కార్మికోద్యమం ఎదుర్కొన్న సవాళ్ళు, మోదీ ప్రభుత్వం వచ్చాక కార్మిక, ఉద్యోగ, రైతాంగ వర్గాలపై కొనసాగుతున్న దాడి వంటి అంశాలను వివరించారు. 1979 లో విద్యార్థి సమాఖ్య ద్వారా కమ్యూనిస్టు ఉద్యమ పరిచయం వచ్చిందని, అప్పటినుండి గత 42 ఏళ్ళుగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీలోనే ఉన్నానని తెలిపారు. తాను పార్టీలో ప్రవేశించే నాటికి ఇప్పటికీ సామాజిక పరిస్థితుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని , పని చేసే పద్ధతులు కూడా మారాయన్నారు. తాము ఎంత ప్రయత్నించినా కార్యకర్తలు రావడం లేదనే నిరాశ విడనాడాలన్నారు. నిబద్ధత కలిగిన 10మంది గట్టి కార్యకర్తలు ఉంటే కార్మికోద్య మాన్ని ముందుకు తీసుకువెళ్ళడం సాధ్యమే నన్నారు. భావితరం నాయకత్వాన్ని తయారు చేసేందుకు లేబర్ స్కూల్ ద్వారా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5 వ మహాసభలో రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయిన తాడికొండ శ్రీనివాసరావును లేబర్ స్కూల్ తరపున అభినందించారు.

వేగం వద్దు ప్రాణం ముద్దు

- జిల్లా ఎస్పి రాహుల్ దేవ్‌శర్మ

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్ : వేగం వద్దు ప్రాణం ముద్దు అని జిల్లా ఎస్ పి రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. ఏలూరు, జంగారెడ్డి గూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్, కైకలూరు సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తో బుధవారం విజిబుల్ పోలీసింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ నేర నియంత్రణ, అక్రమ రవాణా అరికట్టుట, రహదారి ప్రమాదాల నివారణ కొరకు అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు విజిబుల్ పోలీసింగ్ ను నిర్వహిస్తూ, హైవేలపై ప్రయాణం చేస్తున్న భవాని భక్తులకు ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా రహదారి భద్రత, మొబైల్ అధికారులు జాగ్రత్తలను తీసుకుంటూ సురక్షితంగా భవాని భక్తులు విజయవాడ చేరే లాగా చర్యలు తీసుకున్నట్లు ఎస్ పి తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం వలన ప్రాణహాని ఉండదని ఏదైనా ప్రమాద సమయంలో ప్రాణరక్షణగా హెల్మెట్ ఉంటదన్నారు.ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ సురక్షితముగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

విశాలాంధ్ర - పోడూరు : జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతున్నదని జిల్లా జాయింటు కలెక్టరు జె.వి మురళి తెలిపారు.మండలం లోని జిన్నూరులో 1, 2 రైతు బరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింటు కలెక్టరు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మిల్లులకు ధాన్యం తరలించడానికి వాహనాలను సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని రైస్ మిల్లర్లను జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. ధాన్యం నిల్వలు, ట్రక్ షీట్లు, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సేకరించిన ధాన్యానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, మిల్లులకు చేరిన ధాన్యం నిల్వలలో ఎటువంటి తేడా లేకుండా చూడాలని ఆదేశించారు.జిల్లా జాయింటు కలెక్టరు వెంట తహశీల్దారు ఆర్ వి కృష్ణా రావు, వ్యవసాయ శాఖాధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాండ్ పోటీలకు గురుకుల విద్యార్థులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : అన్నమయ్య జిల్లాలోని రాజంపేటలో జరిగే రాష్ట్రస్థాయి బ్యాండ్ పోటీలకు పాల్గొనడానికి పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు వెళ్ళారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు తెలిపారు. బుధవారం ఉ దయం పాఠశాల నుంచి తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ చేరుకుని రైలు ప్రయాణం ద్వారా రాజంపేట చేరుకుంటారని తెలిపారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర మానవ వనరుల శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ స్థాయి బ్యాండ్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి పోటీ అన్ని రాష్ట్రాల్లో బ్యాండ్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం వీటిలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన వారిని ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపుతారని తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర-టి.నరసాపురం : క్రీస్తు మార్గం అనుసరణీయమని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. జ్ఞాన్ రాజు అన్నారు. స్థానిక పెనుయేలు ప్రార్థన మందిరం పాస్టర్ డానియల్ రాజ్ ఆధ్వర్యంలో యుపిఎ సహవాస సేవకుల సహకారంతో రివైవల్ ఐక్య క్రిస్మస్ వేడుక సొసైటీ ఎదురుగా జడ్పీటీసీ సూరిబాబుకు చెందిన స్థలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుపిఎ మండల కమిటీ సభ్యులు క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాలు తెలిపారు. ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొన్న నంద్యాల కు చెందిన ఎస్ జాషువా వాక్యాన్ని బోధించారు. యేసుక్రీస్తు భూమిపై వెలుగుగా వచ్చారని ప్రజలందరూ చెడు అలవాట్లు విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న పాస్టర్ లకు యుపిఎ అధ్యక్షులు జి జ్ఞాన్ రాజు, గౌరవ అధ్యక్షులు కురసం నిరీక్షణరావు బహుమతులు అందించారు. ముందుగా స్థానిక హైస్కూల్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుపిఎ సలహాదారు సిహెచ్ హెూషేయ, రాజు, ప్రసన్న, ప్రసన్న రాజు, అకుల కృపాదానం, జాన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను విజయవంతంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీసర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు సచివాలయ స్థాయిలో ఉన్న సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ప్రణాళికగా ముందుకు వెళ్ళాలని సూచించారు. వీరికి లింగపాలెంలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వందేళ్ళ క్రితం జరిపిన సర్వేల వలన గ్రామాలలో భూవివాదాలు తలెత్తుతున్నాయని, వాటి వలన అర్హులైన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీసర్వేను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్, మండల సర్వేయర్ నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల నియామకం

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో బిజెపిని బలోపేతం చేసేందుకు గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చవటపల్లి విక్రమ్ కిషోర్ తెలిపారు. దాదాపుగా మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ కమిటీల నియామకం పూర్తికావచ్చిందని వివరించారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుర్రా సుబ్బారావు, నియోజకవర్గ స్థాయి నాయకులు రాయంకుల చక్రధరరావు, మాయా వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్డీఎస్‌లో నేడు ఫెన్సింగ్ పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: అంతర్ కళాశాల ఫెన్సింగ్ పోటీలను తమ కళాశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్.ఆర్.డి.ఎస్.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీన జమ్ముకాశ్మీర్ లో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్క్ ఎడ్జస్టుమెంటు విధులు అన్యాయం

విశాలాంధ్ర -భీమవరం: మరో నెల రోజుల్లో జనరల్ ట్రాన్సుఫర్స్ ఉండగా వర్క్ ఎడ్జస్టుమెంటు పేరుతో ఉపాధ్యాయులకు దూరం ప్రాంతాల్లో విధులు కేటాయించడం కక్ష సాధింపు చర్యేనని, ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రామచంద్రరావు డిమాండ్ చేశారు. వర్క్ ఎడ్జస్టుమెంటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్టీయు నాయకులు బుధవారం డిఇఓ కార్యాలయ వర్గాలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్ ఎడ్జస్టుమెంటు పేరుతో ఏభై కిలోమీటర్లు పైబడి ఉన్న స్కూళ్లకు వెళ్లాల్సి వస్తుందని ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు ట్రాన్స్ పోర్ట్ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి సిహెచ్. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, రామారావు

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం బుధవారం ఏలూరు ఏపీఎన్జిఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యింది. ఈ కార్యవర్గ కమిటీలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడుగా చోడగిరి శ్రీనివాస్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా పిఎస్ఆర్ కె ఎస్ఎస్.నాగేశ్వరరావు, కె. సునీత, ఆర్విఎస్ఎన్ మూర్తి,శ్రీనివాస్ రావు,ఎస్ నారాయణ నాయుడు ఎన్నికవగా సెక్రటరీగా ఎన్వి రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి. నరేంద్రబాబు, జాయింట్ సెక్రటరీలుగా ఎం డి ఖాదర్ బేగ్,ఎం లీలా రాణి,ఎం ఫణి కుమార్,ఎం సాంబశివరావు,మహిళా జాయింట్ సెక్రటరీగా వి. మల్లిక, కోశాధికారిగా పి. శ్రీనివాసరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా తూర్పు గోదావరిజిల్లా అధ్యక్షులు గుద్దటి రామారావు,అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా తూర్పుగోదావరిజిల్లా కార్యదర్శి పేపకయాల వెంకటకృష్ణ,ఎన్నికల పర్యవేక్షకులుగా పసుపులేటి శ్రీనివాసులు వ్యవహరించారు.

ఎండిఎఫ్ నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: మైన్స్ డెవలప్మెంట్ ఫండ్స్ (ఏం డి ఎఫ్) ని ధులతో నియోజకవర్గంలో పలు గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలను వెంటనే తయారు చేయాలని ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎండిఎఫ్ నిధులపై సమీక్ష సమావేశం జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ నిధులతో వీరవాసరం గ్రామంలోని పెదపేటకు సంబంధించి అక్కడి ప్రజల కోరిక మేరకు డ్రై న్స్, రోడ్ల నిర్మాణానికి సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భీమవరం మండలం కొత్త పూసలమర్రు గ్రామంలో పలు రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ స్వామి నాయుడు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ రావులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - చాట్రాయి : సార్ ప్రభు త్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీలు రాకపోవడం వలన రైతులు నరకయాతన పడుతున్నారని వారి సమ స్యను పరిష్కరించండి అంటూ పిఏసిఎస్ చైర్‌పర్సన్ చెలికాని బాబ్జి నూజివీడు సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. పోలవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నూజివీడు సబ్ కలెక్టర్ హర్షద్ రాజేంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన బాబ్జి మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సక్రమంగా రాకపోవడం వలన ధాన్యం ఎగుమతి జరగడం లేదని రైతులు భార్యాబిడ్డలతో రాత్రింబవళ్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వానకు తడవకుండా ధాన్యాన్ని కాపాడుకోవడానికి నరకయాతనలు పడుతున్నారని తెలిపారు. సబ్ కలెక్టర్ హర్షద్ రాజేంద్రన్ పోలవరం సహకారసంఘం ఆధ్వర్యంలో మంజూరైన పెట్రోల్ బంక్ కోసం సేకరించిన స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి తాసిల్దార్ సిహెచ్ విశ్వనాథరావు, పోలవరం పి ఎస్ ఎస్ సిఇ ఓ వడాలి ఏసు, ప్రసాదరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వనిర్లక్ష్యం రైతుల పాలిట శాపం

విశాలాంధ్ర- చాట్రాయి : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి రైతుల పాలిట శాపంగా మారిందని తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు మండిపడ్డారు. బుధవారం మండలం లోని చనుబండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆయన రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పండిన ప్రతి ధాన్యపు గింజను తామే కొంటామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసమైన రక్షణ సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఒకపక్క తుఫాను వచ్చి ఎక్కడ ధాన్యం అక్కడే తడిసిపోతున్నా కాటాలు వేసి నిల్వ ఉంచిన బస్తాలు ఎగుమతి చేయడానికి అవసరమైన లారీలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. మిల్లుకు వెళ్లిన తర్వాత తేమ శాతం ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాటా వేసుకోవలసి ఉన్నప్పటికీ 14శాతం వచ్చేవరకు ఎండబెట్టిస్తున్నారని అన్నారు.రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది బకాయి ఎరియర్స్ చెల్లింపు తీర్మానం పట్ల హర్షం

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు నగర కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఉద్యోగ సిబ్బందికి బకాయి ఉన్న 17 నెలల వేతన బకాయి ఎరియర్స్ చెల్లించేందుకు కౌన్సిల్ సమావేశం తీర్మానం ఆమోదించడాన్ని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయుసి) బుధవారం ఒక ప్రకటనలో హర్షం తెలిపింది. 2017లో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ సప్లై డిస్ట్రిబ్యూషన్ కంప్యూటర్ ఆపరేటర్స్, వర్క్ మేస్త్రీలు, వర్క్ ఇన్స్పెక్టర్లు, డ్రైవర్స్ వేతనాలు పెరిగాయని యూనియన్ గౌరవాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. 2017 నుండి 2018 వరకు 17 నెలల పాటు పెరిగిన వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ఏఐటీయుసి గత 4 సంవత్సరాలుగా పోరాడుతుందని తెలిపారు. ఏలూరు కార్పొరేషన్ కార్పొరేటర్ల సమావేశం మంగళవారం మేయర్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన జరిగింది. ఆ సమావేశంలో 17 నెలల వేతన బకాయి ఎరియర్స్ బిల్లును తీర్మానం పెట్టడం జరిగింది.ఆ తీర్మానాన్ని సమావేశం ఆమోదించినందుకు యూనియన్ తరపున మేయర్, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేషన్ కమిషనర్ కి అభినందనలు తెలిపారు.4 సంవత్సరాల ఏఐటియుసి పోరాట ఫలితంగా ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి వేతన బకాయి ఎరియర్స్ రావడం జరిగిందని తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రామవరం పంచాయతీ సర్పంచ్ పిట్టా ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాతల కాలం నాటి నుండి ఆదివాసీలు పోడు భూములను సాగు చేస్తున్నారని అయినప్పటికీ ప్రభుత్వాలు వాటిపై వారికి హక్కు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేపదే విజ్ఞప్తి చేస్తూ కార్యాలయాల చుట్టూ తిరిగిన నేటికీ న్యాయం జరగలేదని వాపోయారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో అదే ఆధారమై ఆదివాసీలు జీవిస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. గిరిజన నిర్వాసితులకు పునరావాస ప్రాంతంలో ఉపాధి కల్పించాలని, గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కారం దారయ్య, పిట్టా వీరయ్య, మడివి కామయ్య, కట్టి గోపాలరావు, కరటం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర - భీమడోలు : గ్రామాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం అని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల వాసు బాబు అన్నారు. బుధవారం పూళ్ళ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.8లక్షల మండల ప్రజా పరిషత్ నిధులతో నిర్మించిన ప్రహరీ గోడ ప్రారం భించి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పూళ్ల గ్రామం కృష్ణ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూళ్ల గ్రామంలో మూడేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల అందుతున్నాయా అనే విషయాలపై ఆరా తీసారు.

దేశ భవిష్యత్తు యువతరానిదే

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : దేశ భవిష్యత్తు యువతరానిదేనిని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నూతన ఆవిష్కరణల రూపకల్పనకు పాటుపడాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి. సందీప్ విద్యార్థులకు సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన బీటెక్ (ఈసీఈ, ఈఐఈ విభాగాలకు చెందిన 90 మంది) విద్యార్థులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)ను బుధవారం సందర్శించారు. ఏపి నిట్ ప్రాంగణ నమూనా, ప్రయోగశాల, గ్రంథాలయం, వర్క్‌షాప్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సందీప్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థుల కొలువులకు కొదవలేదని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చెప్పారు. సృజనాత్మక ప్రతిభ కలిగిన విద్యార్థులకు డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పాఠ్య పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తే ఇటువంటి క్షేత్రస్థాయి ప్రదర్శనలు జీవన నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని తెలిపారు. నన్నయ్య విశ్వ విద్యాలయం ఈ ఐ ఈ , ఈ సి ఈ విభాగాధిపతులు జే. హనుమంతు, బి.సుధా కిరణ్ మాట్లాడుతూ నిట్ ప్రాంగణాన్ని సందర్శించేందుకు సహకరించిన ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సందేహాలను సందీప్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం అధ్యాపకులు పి.వెంకటేశ్వర రావు, డి.శ్రీనివాసరావు, హని కిజియా, ఎన్.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు

విశాలాంధ్ర - ఏలూరు : నగరంలోని ఎన్ ఆర్ ఐ జూనియర్ కళాశాల విద్యార్థులకు సుప్రసిద్ధ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ చే వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారని కళాశాల సిఇఓ వల్లపూడి తులసీరామ్ తెలియజేసారు .ఈ కార్యక్రమంలో యండమూరి వీరేంద్రనాథ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుల పట్ల శ్రద్ధ, పరీక్షలు అంటే భయం, భవిష్యత్ పట్ల ఆందోళన, సమాజం పట్ల అవగహన, తల్లితండ్రులు పట్ల గౌరవ బాధ్యతలు,సోషల్ మీడియా పట్ల అప్రమత్తత తదితర ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ ఏ. మురళి కృష్ణ ప్రభాకరరావు, ఎస్. సత్యనారాయణ, సి.హెచ్. సత్యనారాయణ, సి.హెచ్. శివ కుమార్, కళాశాల ఎఒలు కె.మల్లికార్జున రావు, వి. రాట్నాలు, ఎస్. రామాంజనేయులు, జె.నాగ రాజు , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - పాలకొల్లు : జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుచున్నదని,రైతులకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి సంబధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులు లోపుగానే నగదు జమ జరుగుతుందన్నారు. ధాన్యం రవాణాను ప్రభుత్వం చేపడితే ఏజెన్సీకి రవాణా ఖర్చులు చెల్లించడం జరుగుతుందని, రైతు గాని స్వయంగా రవాణా, గన్ని బ్యాగులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే ధాన్యం డబ్బుతో పాటు సదరు ఖర్చులను కూడా రైతు ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో ఎంతమంది రైతుల దగ్గర నుండి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అనంతరం లంకలకోడేరులోని వెంకటసాయి ట్రేడర్సు రైస్ మిల్లును జిల్లా కలెక్టరు తనిఖీచేశారు. ఈ తనిఖీలో జిల్లా సివిల్ సప్లై అధికారి యన్.సరోజ , ఏ యస్ వో యం.రవి శంకర్, వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ రహీమ్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : ఇంధన వనరులను అవసరం మేరకు పొదుపుగా ,సమర్థంగా వాడుకోవడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా బుధవారం జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద భారీస్థాయిలో ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తూ ఇంధన పొదుపు వారోత్సవాలను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో వుంచుకుని ఇప్పటి నుంచే ఇంధన వనరులను, విద్యుత్ పొదుపుగా వాడాలని, అవసరాలమేరకే విద్యుత్ ను వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ర్యాలీలో ఇందన పొదుపుకు సంబంధించిన స్లోగన్స్ ఫ్లేకార్డ్స్ తో విద్యుత్ పొదుపు పాటిద్దాం-భావితరాలకు విద్యుత్ అందిద్దాం, ఎల్ఇడి బల్బులు వాడదాం అనే నినాదాలతో కలెక్టరేట్ నుండి ఫైర్ స్టేషన్ సెంటరుకు చేరి మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్.ఆర్. పేట నుండి విద్యుత్ సదన్ భవన్‌కు ర్యాలీ చేరింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇలు, ఎడిలు, ఎఈలు, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్ మేన్ లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన వనరులను బాధ్యతతో వినియోగించాలి

విశాలాంధ్ర- భీమవరం : భావితరాలకు చక్కని పర్యావరణం అందించేందుకు ఇంధన వనరులను బాధ్యతతో వినియోగించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పిలుపునిచ్చారు.బుధవారం భీమవరం ప్రకాశం సబ్ సెంటర్ లో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, విద్యుత్ పంపిణీ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు .ముందుగా ఇంధన పొదుపుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటామని అక్కడకు హాజరైన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు .అనంతరం మాట్లాడారు. ప్రతిరోజు పెట్రోల్ తో వాహనం నడుపుతున్నామని దాంతోపాటు సైకిల్ని కూడా వినియోగిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిఆర్ఓ దాసిరాజు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి. ఆదిశేషు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్, డిఈలు ఎం. రాజగోపాల్ ,పి .రాంబాబు,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో మూడున్నర ఏళ్లుగా ప్రజా సంక్షే మాన్ని, ప్రజా సమస్యలను, అభివృద్ధిని పట్టించుకోకుండా అర చేతిలో వైకుంఠం చూపుతున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేం దుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇంచార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) స్పష్టం చేశారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో 13వ డివిజన్ వైఎస్. ఆర్ కాలనీ లో బడేటి చంటి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 14 అంశాల్లో ప్రజాభిప్రాయాన్ని స్వీకరించారు. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి మెరుగుమాల శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నాయకులు గొంగడి సాంబశివరావు, దావుద్, శేఖర్, యేసు, లక్ష్మణరావు, నెరుసు వెంకట్రావు, టైలర్ రాజు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అధైర్య పడవద్దు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఆక్వా రైతులు అధైర్య పడవద్దు అని. ఆక్వా రైతులకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైసీపీ ప్రభుత్వం పై పోరాటం చేసి ఆక్వారంగాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకునే వరకు పోరాటం సాగిస్తామని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సభలో మనోహర్ మాట్లాడారు. రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు అన్ని విధాలా నష్టపోయారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 12 న శ్రీకాకుళం జిల్లా రణస్థలం లో యువశక్తి సభ కు యువత పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. జనసేన కార్యకర్త పులపాకుల శ్రీమన్నారాయణవిద్యుత్ ఘాతంతో ఇటీవల మరణించడంతో ఐదు లక్షల రూపాయలు చెక్కును కుటుంబ సభ్యులకు నాదెండ్ల మనోహర్‌అందచేశారు. కార్యక్రమంలో పి ఏ సి సభ్యులు కనకరాజు సూరి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, ప్రియా సౌజన్య, జనసేన నాయకులు వీర మహిళలు జనసైనికులు వరి రైతులు, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు నగర పంచాయితి

ఆర్.ఓ.సి.నం. 105/2020/ఇ1 తేది. 13-12-2022.

షార్టు టెండరు నోటీసు నెం: 37/Akvd/NUHM/APHSSP/2022-23/E1

ఈ దిగువ పనుల కోసం 'ఇ'- ప్రొక్యూర్ మెంట్ ద్వారా టెండర్లను మున్సిపల్ కమీషనర్, ఆకివీడు నగర పంచాయితి వారు కోరుచున్నారు.

వ.నెం.	పని వివరము	టెండరు నెం.	అంచనా విలువ	కాంట్రాక్టర్ అర్హత
1.	ఆకివీడు నగర పంచాయితి నందు గంగానమ్మ గుడి వద్ద నిర్మించుచున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఫినిషింగ్, డోరులు, విండోస్, ఎలక్ట్రికల్ వర్క్స్, శానిటరీ పనులు మరియు ఇతర పనులు చేయుటకు గాను	37/Akvd/ NUHM/ APHSSP/ 2022- 23/E1	Rs. 30,74,000/-	క్లాస్ - 4

'ఇ' ప్రొక్యూర్ మెంట్ మార్కెట్ నందు ది. 14-12-2022వ తేది నుండి టెండరు షెడ్యూల్స్ లభించును. టెండర్లు డౌనులోడు చేసుకొను ఆఖరు తేది. 22-12-2022 సాయంత్రం గం.4-00ల వరకు. టెండర్లు స్వీకరణ చివరి తేది. 22-12- 2022 సాయంత్రం గం.4-30ల వరకు. టెండర్లు తెరుచు తేది. 22-12-2022 సాయంత్రం గం.5-00ల మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూరు మెంట్ మార్కెట్ www.tender.apeprocurement.gov.in ద్వారా మున్సిపల్ కమీషనర్, ఆకివీడు నగర పంచాయితి, పశ్చిమ గోదావరి జిల్లా, (ఫోన్ / ఫ్యాక్స్ / సెల్ నెం : 08816-252646/7893892567) వారిని సంప్రదించగలరు.

మున్సిపల్ కమీషనర్,
ఆకివీడు నగర పంచాయితి.

విద్యార్థులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - గణపవరం: విద్యార్థులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ఆర్ఎస్ సంతోష్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గణపవరం, నిడమరు మండలాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల ప్రకారం బుధవారం నుండి ఈనెల 19వ తేదీ వరకు ఐదు రోజులు పాటు ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే ఎంపీపీ ఎస్ స్కూల్లో చదువుతున్న 1,2 తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ప్రత్యేకంగా ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు, లాబ్ టెక్నీషియన్ బి. శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు జి శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎంఎస్ యోహాన్,బి. మౌనిక, పి. సౌభాగ్య, వల్లి,కిరణ్మయి, హెచ్ఎం టి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యం

విశాలాంధ్ర -నూజివీడు : ఎస్సీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఏలూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు యార్ల సుజీవరావు అన్నారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీ సెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన.వెంకటేశ్వరరావుతో కలిసి యార్ల సుజీవరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కింద వందల కోట్ల రూపాయల ఖర్చుతో కాలనీలు అభివృద్ధి చేయడంతో పాటు అనేకమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుండి సర్పంచిగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా ఎదగడం తెలుగుదేశం పార్టీ వల్లనే జరిగిందన్నారు. ఈ నెల 17వ తేదీన ఏలూరులో ఫైర్ స్టేషన్ నుండి పాత బస్టాండ్ వరకు జరిగే గర్జన ర్యాలీ విజయవంతం చేసేందుకు నూజివీడు నియోజకవర్గం నుండి ఎస్సీ సెల్ కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు అరికోటి సంగీతరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లి శెట్టి జగదీష్ ,ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు చేతి వేళ్ళు కోల్పోయిన చలంశెట్టి అప్పారావుకు మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.5 వేల ఆర్థిక సహాకారం గౌరవ అధ్యక్షులు పి.టి. వెంకన్న చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి.టి. వెంకన్న, అధ్యక్షులు వర్రి సత్యనారాయణ, కోశాధికారి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి ప్రింటింగ్ ప్రెస్లో జీవనం సాగిస్తున్న చలంశెట్టి అప్పారావుకు ప్రమాదం జరగడం వల్ల కుటుంబానికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. అనుకోని ప్రమాదాలు జరగడం వల్ల పనులు చేసే కార్మికులకు అవయవాలు కోల్పోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. అలాంటి వారికి మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు చేయూతనిచ్చేందుకు అండగా ఉంటుందని అన్నారు.

డీఎన్నార్‌లో మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర -భీమవరం: డీఎన్నార్ కళాశాలలో ఒమిక్స్ డయాగ్నోసిస్ అధ్వర్యంలో బుధవారం జరిగిన మెగా మెడికల్ క్యాంపులో విద్యార్థులకు బిపి, షుగర్, రక్తం పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపును ప్రారంభించిన కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహరాజు, గాదిరాజు బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మోజెస్, ఎ.ఓ. పి.రామకృష్ణంరాజు, పి.జి.కోర్సుల డైరెక్టర్ గా.చంద్రమోహన్, ఆర్.శకుంతల, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెల్లబోయిన రంగారావు, అనిల్ దేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

21న జాతీయ మ్యాథమెటిక్స్ డే

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డిసెంబర్ 21వ తేదీన నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా "గణిత అష్టావధాన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కే విశ్వేశ్వరరావు తెలియజేశారు. గణిత శాస్త్రంలో మేధోపరమైన నూతన ఆవిష్కరణలకు ఈ అవధానం తోడ్పడుతుందని, అవధాని డాక్టర్ ఎస్. వి .ఎస్ సుబ్రహ్మణ్యం అవధానం నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిగ్రీకళాశాలల , జూనియర్ కళాశాలల, పాఠశాలల గణిత అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. గణిత అష్టావధానానికి సంబంధించిన పోస్టర్ మరియు బ్రోచర్లను ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాపాక దేవిడ్ కుమారస్వామి తదితర అధికారులు ఈరోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనబోయే విద్యార్థినీ, విద్యార్థులు,అధ్యాపకులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు.

రాజకీయ పరిస్థితులపై చర్చలు

విశాలాంధ్ర - చాట్రాయి : టిడిపిలో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలపై సీనియర్ నాయకులు కొల్లి వరప్రసాదరావుతో జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ చర్చించారు. బుధవారం చాట్రాయి మండలం తుమ్మగూడెం పంచాయతీ జయపురం గ్రామంలో సీనియర్ నాయకులుకొల్లి వరప్రసాదరావుతో వారి నివాసానికి వెళ్లి మందపాటి బసవా రెడ్డి, కందుల కృష్ణ సుదీర్ఘంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. మండలంలో రోజురోజుకీ గ్రూపు వివాదాలు రాజుకుంటున్న నేపథ్యంలో వీరు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ధాన్యం కొనుగోలుపై ఆకాంక్షలు తొలగించాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఉమ్మిడి వెంకటరావు ధాన్యం కొనే విషయంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు రైతులను చాలా ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నాయన్నారు. ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రత్తిపాడు తహసీల్దారుకు, ఆర్డీవోను, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల్ని కలిసి వినతిపత్రం అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఆయన వెంట ఏపిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కోప్పన కోటేశ్వరరావు, బిసి సెల్ అధ్యక్షులు కొల్లు వీరగణేష్, నియోజకవర్గం శక్తీ కో-ఆర్డినేటర్ ఉమ్మిడి సురేష్ తదితరులు ఉన్నారు.

అమూల్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలో అమూల్ ఔట్ లెట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ అమూల్ ప్రాజెక్టుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్, ప్రధాన కూడళ్ళు, కళాశాలల్లో అమూల్ ఉత్పత్తుల అమ్మకాల ఔట్లెట్స్ ను ఎస్ హెచ్ సి గ్రూపుల ద్వారా నిర్వహించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. తాడేపల్లిగూడెం పరిధిలో 10 బిఎంసియులు ఏర్పాటు చేసి అమూల్ పాల సేకరణ జరుగుచున్నదన్నారు. అలాగే నరసాపురం పరిధిలో మరో 21 బిఎంసియులను ఈనెల 21న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అమూల్ కి పాలు ఇవ్వడం ద్వారా చేకూరే ప్రయోజనాలను రైతులకు సవివరంగా తెలియజేయాలన్నారు. ప్రతి పాడి రైతు నుండి కనీసం ఒక లీటరుకు తగ్గకుండా పాలను అమూల్ కి ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. పాలు పోసిన వారికి మాన్యువల్ గా కాకుండా ఎలక్ట్రానిక్ స్లిప్ ఇచ్చేలా ప్రింటర్లను సిద్ధం చేయాలన్నారు. పాల క్యాన్లను తరలించే సందర్భంలో పాలు పాడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేయూత పథకం ద్వారా పశువులను అందజేయడానికి లబ్ధిదారుల ఎంపిక సర్వే జరుగుచున్నదని, తొలి విడతలో 5 వేల పశువులను అందచేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డి ఆర్ డి ఏ పి.డి ఎం.ఎస్.ఎన్ వేణు గోపాల్, జిల్లా పశుసంవర్ధన్ శాఖ అధికారి కె. మురళీ కృష్ణ, జిల్లా కోపరేటివ్ అధికారి రవి కుమార్, అమూల్ ప్రతినిధులు కేవల్ పటేల్, నవాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పడండి

- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : ఓఎన్జీసీ సిఎస్ఆర్ నిధులు అందజేయడం ద్వారా జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఓఎన్జిసి అధికారులను కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ఓఎన్జిసి అధికారితో సమావేశమై సిఎస్ఆర్ నిధులు జిల్లాకు కేటాయింపు పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య, విద్య తదితర జిల్లా అవసరాల ప్రతిపాదనల మేరకు సిఎస్ఆర్ నిధులను సమకూర్చాలని కోరారు. నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో ఓఎన్జిసి పైపులైన్లులు వెళ్లే మార్గంలో ఎక్కువ పేద వర్గాలు నివసిస్తున్నాయన్నారు. అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలతో ముందుకు వస్తామని సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. ఈ సందర్భంలో ఓఎన్జిసి డిఎం (హెచ్ఆర్) ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశుధ్యం, గ్రామీణ మౌలిక వసతుల ఏర్పాటు అంశాలపై సాధారణంగా సిఎస్ఆర్ ఫండ్స్ ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలను దృష్టిలో ఉంచుకొని తగు చర్యలకు సిఫారసు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం. సూర్య తేజ, ఓఎన్జిసి డిఎం (హెచ్ఆర్) ఎం.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి వి.ఆదిశేషు, సిపిఓ కె .శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ.ఇ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని పారద్రోలి విజ్ఞాన కాంతిని ఇచ్చేదే సైన్స్

విశాలాంధ్ర - రౌతులపూడి : ప్రపంచ భావితరాల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలను ముందుగా పసిగట్టి వాటిని ఎదుర్కోవడం తగు జాగ్రత్తలు పాటించడం, విశ్వాంతరాలను పరిశీలించడం పరిశోధించడం మానవులపై జరిగే వివిధ వ్యాధుల రక్షణ వంటి ఇంకా ఎన్నో బృహత్తరమైన పనులు నిర్వహించడానికి సైన్సే ప్రధాన కారణం. సైన్స్ లేనిది మొనగాడ లేదని మానవుడు ఏనాడు గ్రహించి పరిశోధనల వైపు పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు. సైన్స్ ఆవశ్యకతను విశిష్టతను గుర్తించిన మేధావులు పాలకులు అధికారులు ఇప్పటినుండి విద్యార్థులలో సైన్సు పట్ల సృజనాత్మకతను, మేధస్సును పదును పెట్టి ప్రోత్సహించే విధంగాను సైన్స్ ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన రౌతులపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో మండలంలోని 11 పాఠశాలలకు చెందిన 105 మంది విద్యార్థులు వారి మెదడుకు పదును పెట్టి 52 సైన్స్ థీమ్స్‌ను విద్యార్థులు తయారు చేసి మండల విద్యాశాఖ అధికారి ఎస్వీ నాయుడు ఆధ్వర్యంలో పాఠశాలలో పరిశీలన కొరకు ఉంచారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గంటిమళ్ల రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి (చిన్న దివాణం), మండల తహసీల్దార్ శివకుమార్ ప్రారంభించారు. విద్యార్థులకు తయారు చేసిన ప్రతి థీమ్ దగ్గరికి వెళ్లి వాటి ప్రయోజనాన్ని పనిచేసే విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎన్విరాన్మెంట్ మరియు క్లైమేట్ చేంజ్ విభాగంలో లైట్ పొల్యూషన్ ఐటమ్ తయారుచేసిన రౌతులపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.అభిషేక్, వాతావరణ మార్పులు ఐటెం తయారుచేసిన ఎస్.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎ. మణికంఠ ఇరువురు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆరోగ్యం పరిశుభ్రతలో పారుపాక ఎంపీ యూపీ పాఠశాలకు చెందిన పి సౌజన్య స్వచ్ఛభారత్ ఐటమ్ మరియు రాజవరం ఎంపీపీ పాఠశాలకు చెందిన పి రమ్య ఐటెంలోను రెండవ స్థానంలో నిలువగా, ఈకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగంలో సోలార్ ఇరిగేషన్ సిస్టమ్‌ను తయారు చేసిన ఎస్ పైడిపాల ఎంపియుపి పాఠశాలకు చెందిన సిహెచ్ దేవి ప్రియా మరియు ఇదే విభాగంలో విద్యుత్తు ఉపయోగించి వాహనాల వేగాన్ని అదుపు చేసే ఐటెం తయారు చేసిన కె. రేఖ మేరీ మూడవ స్థానంలో నిలిచారు. టెక్నాలజీ స్మార్ట్ ఫోన్ లీడర్ విభాగంలో కె. వరుణ్ జెడ్‌పిహెచ్ రౌతులపూడి పి కృష్ణమోహన్ జడ్పీహెచ్ ములగపూడి నాలుగో స్థానంలోనూ మ్యాథ్ మెటికల్ మోడలింగ్ ఎ. పుష్ప గంగ భవాని జడ్పీహెచ్ఎస్ అగ్రహారం. ఐదవ స్థానంలో నిలిచారు. వీరిని కాకినాడలో జరగబోయే సైన్స్ ఎగ్జిబిషన్లో పంపిస్తామని మండల విద్యాశాఖ అధికారి ఎస్వీ నాయుడు తెలిపారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాడి కొండబాబు, పాఠశాల ఉపాధ్యాయులు రౌతులపూడి ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కర బాబు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక ఏరియా ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల పై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సహాయం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కోవిడ్ సమయంలో దాతలు ఇచ్చిన విరాళాల వడ్డీ సొమ్ము రూ.1.50 లక్షలతో వైద్య సిబ్బందికి అవసరమైన కుర్చీలు, టేబుల్స్, సిబ్బందికి ఏర్పాటు చేసిన గదులను ప్రారంభించారు. ఇటీవల ఆసుపత్రికి మంజూరైన ఎనలైజర్ కొరకు ప్రత్యేకంగా ల్యాబ్‌కు అవసరమగు ఒక ఏసీ మిషన్, మౌలిక సదుపాయాలు సుమారు రూ.2 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేయుడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఆసుపత్రికి ప్రభుత్వం సిబ్బందిని కేటాయించడం జరిగిందని, మిగిలిన వైద్యులను కూడా కేటాయించిన తర్వాత నుండి పూర్తి సేవలో వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే సూర్య నారాయణ రెడ్డి తెలిపారు.

అంగరలో గడపగడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నకు విచ్చేసిన ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులుకు ఘన స్వాగతం లభించింది. స్థానిక సర్పంచ్ వాసా కోటేశ్వర రావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు ప్రతి ఇంటికి వెళ్ళి, సీఎం జగన్ పాలనలో అందిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. సంక్షేమ పథకాలు అమలులో ఏమయినా సాంకేతిక ఇబ్బందులు వలన అందక ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకొని వస్తే వార్డు వాలంటీర్‌లు, సచివాలయం సిబ్బందికు పరిష్కారం చేయవలసిందిగా ఆదేశిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో వున్న సామాజిక సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని తోట తెలిపారు. ముందుగా మండల వైసీపీ కార్యాలయం వద్ద 111 మందికి జగనన్న భూ హక్కు పత్రాలు అందజేశారు. తోట వెంట స్థానిక ఎంపీపీ మేడిశెట్టి సత్యవేని దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీలు అద్దాల శ్రీనివాస్, మేడిసెట్టి దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ యర్రా వీరన్న బాబు, తిరునాతి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వంగా శ్రీను, నాయుకులు వంగా నల్లశ్రీను, ప్రగడ అర్జునరావు, కరాటపు దుర్గా ఖండేశ్వర రావు, తొరాటి వెంకట రత్నం, బదుగు రాంబాబు, పుత్సల వీర వెంకట సత్యనారాయణ, వివిధ గ్రామాల నుండి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేసే పార్టీ జనసేన

విశాలాంధ్ర - అంబాజీపేట : ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు జనసేన పార్టీ ముందు ఉంటుందని జనసేన పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. అంబాజీపేట పెద్ద వీధిలో ఉన్న వైఎస్‌పి ఆర్ అండ్ ఏవిఆర్ మండపంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ఎన్నో వనరులు ఉన్నాయని ఈ ప్రాంతంలో ఒక పరిశ్రమ కూడా నెలకొల్పకపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతంలో సరైన ఉపాధి లేక ఎంతమంది యువకులు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని అన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు కనీస అవసరాలు కల్పించలేదని అన్నారు. 56 కార్పొరేషన్లు ద్వారా ఎవరికి లబ్ధి చేకురా లేదని మండిపడ్డారు. ఏపీఎస్ ఆర్టీసీని వైఎస్ఆర్ సంస్థగా చేశారని మండిపడ్డారు. అనంతరం ఇతర పార్టీల నుండి పార్టీలోకి చేరిన బీసీ, యస్సీ సోదరులను ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న జనసేనకులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు అంబాజీపేట, అయినవిల్లి గ్రామాల్లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొంది ప్రమాదవశాస్తూ మరణించిన కుటుంబాలని మనోహర్ పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అందచేసిన ఐదు లక్షల రూపాయల భీమా చెక్కును అయినవిల్లి గ్రామానికి చెందిన గుద్దటి ముక్తేశ్వరరావు, అంబాజీపేటకు చెందిన చెరుకూరి పనస రాముడు కుటుంబాలకు మనోహర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసి సభ్యులు పితాని బాలకృష్ణ, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జ్ డియంఆర్ శేఖర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా ఆదివిష్ణు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా ఏ ఆదివిష్ణు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జట్ల సోమరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం సాధించుకునేందుకు ఉద్యోగ ఉపాధ్యాయులు ఐక్యంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏలేశ్వరం మండల యుటిఎఫ్ నూతన కమిటీని ఎంపిక చేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులు జి. సుందర రావు, అధ్యక్షులుగా ఎ. ఆదివిష్ణు, సహా అధ్యక్షులుగా ఎస్. గణపతిరావు, మహిళా సహాధ్యక్షులుగా పి. గంగాభవాని, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సంజీవ్, కోశాధికారిగా కె. రవిలను ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్యకర్త మతికాని రాంబాబు, పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, కార్యదర్శి జోగిరాజు, జమీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

నేషనల్ హైవే పై అక్రమ కట్టడాలు ఆపాలి

విశాలాంధ్ర - గండేపల్లి : పేదవారు జీవనం కోసం రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని జీవిస్తున్న వారిపై నేషనల్ హైవే అథారిటీ అధికారులు వారి జులుం ప్రదర్శిస్తూ పేదవారికి జీవితం లేకుండా చేస్తున్నారు. కానీ ఆర్థికంగా, రాజకీయంగా బలపడిన పెద్దలకు హైవే రూల్స్ వర్తించవని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రశ్నించారు. బుధవారం రామవరం భూరుగుపూడి మధ్యలో ఉన్న పెట్రోల్ బంక్‌ను ఆర్‌డిఒ, ఎంఆర్ఓ ఇతర అధికారులు పర్యవేక్షించడానికి వచ్చిన వారిని కర్నాకుల ప్రశ్నించారు. తక్షణమే హైవేని అనుకుని ఉన్న పెట్రోల్ బంకు పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా హైవే రోడ్డుకు ఆనుకొని ఇలాంటి అక్రమాలు నిర్మాణాలు కట్టడం వల్ల ప్రయాణికులకు ప్రమాదలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇలాంటివి హైవే పై మీరు ఎలాగా పర్మిషన్లు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. పర్మిషన్లు ఇచ్చిన హైవే అథారిటీ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని ఎడల మా ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

తాడిపూడి లో డ్రైనేజి అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన 20 లక్షల రూపాయల అభివృద్ధి నిధులతో మండలం లోని తాడిపూడి గ్రామంలో చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. బిల్లులు వస్తాయో, రావో అన్న అనుమానంతో పాటు ఇతర సాంకేతిక ఇబ్బందుల కారణంగా దాదాపు ఏ పంచాయతీ కూడా 20 లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రాలేదు. తాడిపూడి సర్పంచ్ గ్రామ సర్పంచ్ నామా శ్రీనివాస్ మాత్రం గ్రామంలో సిసి డ్రైన్ పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యం లోనే తాళ్లపూడి ఎంపీడీఓ రాజశేఖర్ బుధవారం పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, డ్వాక్రా మరియు అంగన్వాడి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌తో పాటు సొసైటీ అధ్యక్షులు కొలుకుల అబ్బులు, వార్డు సభ్యులు పిట్టా తమ్మారావు, కాకరపర్తి అనసూయ, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, భీమేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పట్టం కట్టండి

విశాలాంధ్ర- గోపాలపురం : జగన్మోహన్ రెడ్డి నియంత పాలనకు స్వస్తి పలికి ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిట్యాల గ్రామంలో ఇదేం కర్మ రాష్ట్ర ప్రభుత్వానికి అనే కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండలఉపాధ్యక్షులు నూతంగి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వాన్ని ఆర్థికంగా అధోగతి పాలు చేస్తూ రాక్షసపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రధాన వాణిజ్య పంట వర్జీనియా పొగాకు రైతులతో, కూలీలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలను గూర్చి చర్చించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. రైతులతో కూలీలతో మమేకమై తెలుగుదేశం పార్టీ నాయకులు కుందుర్తి రామారావు, పచ్చ వీరన్న, మాస బత్తుల మంగయమ్మ పలువురు,అస్వస్థతకు గురైన కుటుంబాల వారిని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు గద్దె హరిబాబు, కొర్లపాటి రాము, నందిన.సుబ్రహ్మణ్యం,గద్దె యుగంధర్,ఉండవల్లి శ్రీను.మాజీ సర్పంచ్ గద్దె.దుర్గారావు,పలువురు సీనియర్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

సేవ చేయడం గొప్ప వరం

విశాలాంధ్ర - ఉండి :సేవ చేయడం గొప్ప వరమని సేవ చేయటంలో ఉన్న సంతృప్తి మరి దేనిలో ఉండదని లయన్స్ క్లబ్ అంతర్జాతీయ పాస్ట్ ప్రెసిడెంట్ డగ్లస్ ఎక్స్ అలగ్జాండర్ అన్నారు. బుధవారం ఆకివీడు వచ్చిన సందర్భంగా ఉండి లయిన్స్ క్లబ్ సభ్యులు డగ్లస్ ఎక్స్ అలెగ్జాండర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో పలు ప్రాంతాలు సందర్శించినట్టు తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ ఎల్‌సిఐఎఫ్ ఛైర్మెన్ గా ఉన్నానన్నారు. ఆయన కలిసిన వారిలో ఉండి లయిన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్ర రాజు నరసరాజు, అధ్యక్షులు గొట్టుముక్కల రాము, వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు, కోశాధికారి కన్నెగంటి రూత్ కళ, మాజీ అధ్యక్షులు భూపతిరాజు హరనాథ్ రాజు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక జ్ఞానాన్ని సంపాదించుకోవాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు గొల్లప్రోలు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు నుంచి 35 ప్రాజెక్ట్‌లు వచ్చాయని మీడియాకు తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో ఐదు అంశాలను నిర్ధారించుకుని సైన్స్ ఫెయిర్ ప్రదర్శన నిర్వహించినట్టు తెలిపారు. ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా గొల్లప్రోలు మండల జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే వైజ్ఞానిక జ్ఞానాన్ని సంపాదించు కోవాలని సూచించారు. ఈ ప్రదర్శనకు న్యాయ నిర్ణేతలుగా గొల్లప్రోలు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కె. రాజశేఖర్, లెక్చరర్ జగదీష్,రిటైర్డ్ గెజిటెడ్ హెచ్ఎం చందు బాబురావు వ్యవహరించారు. గెలుపొందిన విజేతలకు జెడ్పీటీసీ లోవరాజు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, విద్యా కమిటీ ఛైర్మెన్ అమలకంటి శ్రీను, నేమాని ఆది విష్ణు, స్థలదాత దాసం అచ్చిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యరామచంద్ర రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర - కిర్లంపూడి : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న మేధా సంపత్తిని, విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ కెవి మాధవరావు, ఈఒపిఆర్డి శ్రీనివాసరావు, పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు శ్యాంబాబు, పలువురు ఉపాధ్యాయులు ప్రారంభించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి టి. జోసఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొని మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగానే కాకుండా భారతరత్న అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని గొప్ప గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలని సూచించారు. ఎంఈఓ, టి జోసెఫ్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాలిన నూకరాజు విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5 ప్రాజెక్టులకు సంబంధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోనేడ ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్, అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శకుడు బుద్ధ శ్రీనివాస్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, రాపేటి ప్రసాద్, గరగా గోవిందు, పాఠశాల కమిటీ చైర్మన్ అళ్ళ రామశివ, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయలు జి శ్యాం బాబు, మొల్లేటి సరస్వతి, బిళ్లకుర్తి శివాజీ, పెనగంటి రాజేష్, శరణం సంతోష్, వేగి సాంబశివ, దాడి అప్పలరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరలు ఫుల్-అభివృద్ధి నిల్

విశాలాంధ్ర - రాజానగరం : వైసీపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు దాదాపు ఫుల్‌గా పెంచేరని,రాష్ట్ర అభివృద్ధి మాత్రం నిల్ అని నియోజకవర్గ ఇన్‌చార్జి పెందుర్తి వెంకటేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మండలంలోని జి యర్రంపాలెం గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగ గ్రామంలోని ఇంటింటికి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ముద్రించిన కరపత్రాలు ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియా ద్వారా సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిశెట్టి చంటి బాబు, కొల్లంరత్నం, చిట్టిప్రోలు పద్దరాజు, ఉప్పలపాటి వివి సత్యనారాయణ రాజు వర్మ, బైరిశెట్టి బోసయ్య, రాంబాబు, పొన్నాడ గౌరీ శంకర్, నేకూరి రవి, బొజ్జపుఆనంద్, కొండా సుబ్బారావు, గుర్రం రాజారావు ఉప్పలపాటి రాంబాబురాజు, దేవన నరసింహారావు, గుత్తుల ఆదినారాయణ, మద్దిరెడ్డి రాంబాబు, సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.